నమస్తే తెలంగాణ
హైదరాబాద్
హైదరాబాద్- మేడ్చల్
I | హైదరాబాద్, శుక్రవారం 16 ఆగస్టు 2024 | HYDERABAD

చారిత్రక గోల్కొండ కోటలో గురువారం స్వాతంత్ర్య వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు విశేషంగా అలరించాయి.

పశ్చిమ బెంగాల్‌లో జూనియర్ డాక్టర్‌పై హత్యాచార ఘటనను నిరసిస్తూ.. గురువారం గాంధీ వైద్యశాల నుంచి పద్మారావునగర్ వరకు జూడాలు కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు.

నగరాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతాం

కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

సిటీబ్యూరో, ఆగస్టు 15 (నమస్తే తెలంగాణ) : హైదరాబాద్‌ను ఆదర్శంగా తీర్చిదిద్దుతామని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. కలెక్టరేట్‌లో గురువారం స్వాతంత్ర్య దినోత్సవాన్ని ఘనంగా జరుపుకొన్నారు. కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి జాతీయ జెండా ఆవిష్కరించి జిల్లా అభివృద్ధికి తీసుకుంటున్న చర్యలను వివరించారు. హైదరాబాద్‌లో 691 ప్రభుత్వ , 253 ఎయిడెడ్ పాఠశాలల్లో మొత్తం 88,547 విద్యార్థులకు నాణ్యమైన విద్యాబోధన అందిస్తున్నామన్నారు. అలాగే ఎయిడెడ్ పాఠశాలల్లో 60 వేల విద్యార్థులకు మధ్యాహ్న భోజనం పథకం అమలు చేస్తున్నట్లు చెప్పారు. అమ్మ ఆదర్శ పాఠశాలల కార్యక్రమంలో భాగంగా 384 ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పిస్తున్నట్లు వివరించారు. విద్యార్థుల హాజరుశాతం పెంపొందించేందుకు కృషి చేసిన ప్రధానోపాధ్యాయులతో 'కాఫీ విత్ కలెక్టర్' కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని పేర్కొన్నారు. జిల్లాలో 2,71,963 మందికి ఆసరా పింఛన్లు అందిస్తున్నామని, అందుకోసం నెలకు రూ.61 కోట్లకు పైగా కేటాయిస్తున్నట్టు కలెక్టర్ పేర్కొన్నారు. కల్యాణ లక్ష్మి పథకం కింద 1703 మందికి రూ.17కోట్లకుపైగా అందించామన్నారు. షాదీ ముబారక్‌లో 5494 మందికి రూ.55 కోట్లు అందజేసినట్లు పేర్కొన్నారు. ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో 91 యూపీహెచ్‌సీఎస్, 169 బస్తీ దవాఖానాలు ఉన్నాయన్నారు. 28 మంది ఆర్‌బీఎస్‌కే బృందాల ద్వారా 2.27 లక్షల వైద్య పరీక్షలు నిర్వహించినట్టు వెల్లడించారు. రాజీవ్ ఆరోగ్య శ్రీ పథకం ద్వారా రూ.5లక్షల నుంచి రూ.10 లక్షల పెంపు అనంతరం 32,370 మందికి రూ.79.52 కోట్లు వైద్య చికిత్సలకు చెల్లించినట్టు వివరించారు.

నాచారం ప్రధాన రహదారిలో పేరుకుపోయిన వ్యర్థాలు

ఏడి చెత్త ఆడనే..

పడకేసిన పారిశుధ్యం

ఎక్కడ చూసినా.. చెత్త కుప్పలే

జీవీపీ పాయింట్ల ఎత్తివేతలో నిర్లక్ష్యం

విజృంభిస్తున్న మలేరియా, డెంగీ

క్షేత్రస్థాయి తనిఖీలు చేపట్టని కమిషనర్, మేయర్

టెలీకాన్ఫరెన్స్‌లకే పరిమితం కావడంతో మెరుగుపడని చెత్త సేకరణ

ఈ నగరానికి ఏమైంది.. ? ప్రతి నగరవాసి మదిలో తొలుస్తున్న ప్రశ్న ఇది. ఎక్కడి కక్కడే పేరుకుపోతున్న వ్యర్థాలు.. దాడి చేస్తున్న దోమలు.. విజృంభిస్తున్న రోగాలు.. కుక్కల స్వైరవిహారం.. తడిపొడి చెత్త సేకరణలో వైఫల్యం..ఇలా చెప్పుకుంటూ పోతే.. ప్రతి అంశంలోనూ నిర్లక్ష్యం.. అలసత్వం కొట్టొచ్చినట్లు కనిపిస్తున్నది. బల్దియాలో పాలన గాడితప్పుతున్నది. కోటి మందికి పైగా ఉన్న ప్రజలకు జీహెచ్‌ఎంసీ సేవలు సకాలంలో అందడం లేదు. క్షేత్రస్థాయిలో తనిఖీలు చేపట్టి.. పరిస్థితులను చక్కదిద్దాల్సిన అధికార యంత్రాంగం పట్టించుకోవడం లేదు. కేవలం టెలీకాన్ఫరెన్స్‌ల వరకే పరిమితమవుతుండటంతో స్వచ్ఛతలో భాగ్యనగరాన్ని అగ్రస్థానంలో నిలుపాలన్న లక్ష్యం నీరుగారుతోంది.

-సిటీబ్యూరో, ఆగస్టు 15 (నమస్తే తెలంగాణ)

బల్దియా.. తీరు మారదా! 2,640 చోట్ల చెత్త కుప్పలు

మహానగరంలో కోటి మందికి పైగా ప్రజలకు సేవలందించాల్సిన జీహెచ్ ఎంసీ సేవలు సకాలంలో అందడం లేదు. చెత్త సమస్యల నుంచి రోడ్ల అవస్థల వరకు..ప్రాపర్టీ ట్యాక్స్ ఫిర్యాదుల నుంచి దోమలు, కుక్క కాట్ల దాకా.. ప్రజా సమస్యలపై పట్టింపు లేకుండా పోతోంది. డెంగీ, మలేరియా వ్యాధులు విజృంభిస్తున్నా.. పారిశుధ్య నిర్వహణలో అధికారులు నిద్ర మత్తు వీడటం లేదు. ఎక్కడ చూసినా చెత్త కుప్పలే దర్శనమిస్తున్నాయి. ఈ క్రమంలోనే చెత్తా చెదారంలో దోమలు నివాసాలుగా ఏర్పర్చుకొని జనంపై దాడి చేస్తున్నాయి. దీంతో జనం జ్వరాలతో దవాఖానల చుట్టూ తిరగాల్సి వస్తున్నది. చెత్త రహిత నగరంగా తీర్చిదిద్దాల్సిన జీహెచ్ఎంసీ.. పూర్తిగా విఫలమవుతున్నది. పారిశుధ్య కార్యక్రమాల నిర్వహణ, వ్యాధుల నివారణకు ఏటా రూ. 300 కోట్లకు పైగా ఖర్చు చేస్తున్నా..లక్ష్యాన్ని మాత్రం సాధించలేకపోతోంది. ఇంటింటికీ తడి, పొడి చెత్త సేకరణ, తరచూ చెత్త వేసే ప్రాంతాల (గార్బేజీ వనరేబుల్ పాయింట్లు/జీవీపీ) ఎత్తివేతలో అధికారుల వైఫల్యం కనిపిస్తున్నది.

గ్రేటర్ వ్యాప్తంగా చెత్త డబ్బాలను ఎత్తి వేయగా, ఇప్పటికీ 2640 చోట్ల చెత్త కుప్పలున్నట్లు ఆస్కి (అడ్మినిస్ట్రేటివ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా) ఇటీవల నిర్వహించిన సర్వేలో తేల్చడం.. అధికారుల పనితీరును ప్రశ్నిస్తోంది. ఈ నేపథ్యంలోనే ఎక్కడా చూసినా పెద్ద పెద్ద చెత్త కుప్పలు దర్శనమిస్తున్నాయి . వ్యర్థాలతో నిండిపోయినా బస్తీలు, కాలనీలు వెరసి దోమలతో దవాఖానల్లో పెరుగుతున్న వ్యాధి పీడితులతో ప్రజల్లో ఆందోళన నెలకొంది. అడుగడుగునా కొందరి అధికారుల అవినీతి లెక్కలు, రికార్డుల్లో తప్ప క్షేత్రస్థాయిలో కనిపించని సిబ్బంది..కాగితాల్లో మాత్రమే కనిపించే చెత్త తరలింపు..మేయర్, డిప్యూటీ మేయర్, కమిషనర్ మొదలుకొని డిప్యూటీ కమిషనర్ల వరకు క్షేత్రస్థాయి పర్యటనలు ఉండటం లేదు. మేయర్, కమిషనర్ కేవలం టెలీకాన్ఫరెన్స్‌లకే పరిమితమవుతుండటంతో లోపాలు కొట్టొచ్చినట్లు కనిపిస్తున్నాయి. ఒక్క వీఐపీలు ఉండే ప్రాంతాలు, ప్రధాన రహదారుల్లో మాత్రమే పారిశుధ్య నిర్వహణ మెరుగ్గా కనబడుతుందే తప్ప.. కాలనీలు, బస్తీల్లో చెత్త సేకరణ సక్రమంగా జరగడం లేదన్న విమర్శలు ఉన్నాయి.

ఎక్కడ చూసినా..

స్వచ్ఛ సర్వేక్షణ్-2024లో హైదరాబాద్ నగరాన్ని స్వచ్ఛతలో అగ్రస్థానంలో నిలుపుతామన్న లక్ష్యం నీరుగారుతోంది. స్వచ్ఛ ఆటోల ద్వారా ఇంటింటి చెత్త సేకరణ సక్రమంగా జరగడం లేదు. ఈ నేపథ్యంలోనే పారిశుధ్యంపై ఫిర్యాదులు అధికం కావడం, ఇటీవల హైదరాబాద్ ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో స్వయంగా మేయర్ గద్వాల్ విజయలక్ష్మి పారిశుధ్య నిర్వహణ ఏ మాత్రం బాగులేదని, తన డివిజన్‌లో చెత్త ఎత్తడం లేదని అధికారులపై మండిపడటమే ఇందుకు నిదర్శనం. వాస్తవంగా వర్షాకాలంలో వ్యర్థాలు త్వరగా కుళ్లి దుర్గంధం వెదజల్లే పరిస్థితులు ఎక్కువ. దీని చక్కదిద్దేందుకు , చెత్తను ఎప్పటికప్పుడు తరలించేందుకు వర్షాకాలంలో ప్రత్యేక ఏర్పాట్లు చేయడం లేదు. వర్షాలొస్తే దోమలు, ఈగలు, క్రిమికీటకాలు వృద్ధి చెంది రోగాలు వ్యాపించే ప్రమాదం పొంచి ఉంది. ఇప్పటికే మలేరియా, డెంగీ కేసులు విజృంభిస్తున్నాయి. ఈ నేపథ్యంలోనే వర్షాకాలంలో పారిశుధ్య నిర్వహణకు మెరుగైన చర్యలు తీసుకోవాలని ప్రజలు వేడుకుంటున్నారు.

హైడ్రా కొరడా!

అక్రమార్కులపై బుల్డోజరు

అక్రమ నిర్మాణాలు పరిశీలించిన 24 గంటల్లోగా యాక్షన్

బాచుపల్లి ఎర్రకుంట చెరువులో అపార్ట్‌మెంట్ల కూల్చివేత

'హైడ్రా' ఆక్రమణదారుల గుండెల్లో దడ పుట్టిస్తున్నది.. అక్రమ నిర్మాణాలపై దూకుడు పెంచింది. ఫిర్యాదు అందిన 24 గంటల్లోగా యాక్షన్‌లోకి దిగుతున్నది.. చెరువులు..కుంటలు..నాలాలు.. పార్కులను కబ్జాచేసిన వారిపై ఉక్కుపాదం మోపుతున్నది... ఇప్పటికే బంజారాహిల్స్‌లోని మిథిలా నగర్ కాలనీ, లోటస్ పాండ్ పార్కు..గాజుల రామారం..బుమ్‌రుఖా ఉద్ దవాల్ చెరువుల్లో అక్రమ కట్టడాలను తొలగించిన హైడ్రా.. తాజాగా గురువారం బాచుపల్లి ఎర్రకుంట చెరువులో వెలసిన అపార్ట్‌మెంట్లను కూల్చివేసింది. -సిటీబ్యూరో/దుండిగల్, ఆగస్టు 15

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని నిజాంపేట మున్సిపల్ కార్పొరేషన్, దుండిగల్ మున్సిపాలిటీ పరిధి పలు చెరువుల్లోని ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లో నిర్మించిన అక్రమ నిర్మాణాలను బుధవారం హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ పరిశీలించిన నేపథ్యంలో గురువారం తెల్లవారు జామున 2 గంటల నుంచే కూల్చివేతలు మొదలుపెట్టారు. ఈ క్రమంలో బాచుపల్లిలోని సర్వే నంబర్ 134లోని మొత్తం మూడు అపార్ట్‌మెంట్లను కూల్చివేసేందుకు చర్యలు చేపట్టారు. మూడు బ్లాక్‌లలో ఈ అపార్ట్‌మెంట్ల నిర్మాణం జరుగుతున్నది. ఒక్కో అపార్ట్‌మెంట్ 360 గజాల విస్తీర్ణంలో నిర్మిస్తున్నారు. అయితే ఎర్రకుంట చెరువు 3.20 ఎకరాల విస్తీర్ణంలో ఉండగా...ఎఫ్‌టీఎల్ పరిధిలో ఈ మూడు అపార్ట్‌మెంట్ల నిర్మాణం జరుగుతున్నదని హైడ్రాకు ఫిర్యాదులు అందాయి. అయితే సదరు నిర్మాణదారులు రెవెన్యూ, ఇరిగేషన్ ఎన్‌వోసీల ఆధారంగా హెచ్‌ఎండీఏలో నిర్మాణానికి అనుమతి తీసుకొని.. దాదాపు రూ. 30 లక్షల మేర డెవలప్‌మెంట్ ఫీజు చెల్లించి నిర్మాణం చేపడుతున్నారు. వాస్తవంగా ఎఫ్‌టీఎల్‌లో నిర్మాణం ఉందని ధ్రువీకరించి హైడ్రా సదరు అపార్ట్‌మెంట్లను కూల్చారు. ఇందుకోసం భారీ కట్టింగ్ మిషన్‌లతో పాటు 2 భారీక్రేన్, 2 ఇటాచీల సహాయంతో చేపట్టిన కూల్చివేతల ప్రక్రియ సాయంత్రం వరకు కొనసాగింది. ఇప్పటి వరకు రెండు అపార్ట్‌మెంట్లను నేలమట్టం చేసిన అధికారులు.. మరో అపార్ట్‌మెంట్‌ను శుక్రవారంలోగా కూల్చివేసామని అధికారులు తెలిపారు. కాగా ఈ అక్రమ నిర్మాణాల వెనుక సంబంధిత రెవెన్యూ మున్సిపల్ అధికారులు, హెచ్‌ఎండీఏ అధికారుల పాత్ర ఏమిటన్నది విచారణ చేపట్టకపోవడంపై విమర్శలు వినిపిస్తున్నాయి. సదరు నిర్మాణదారులకు కూల్చివేతలపై నోటీసులు ఇవ్వలేదని, హైడ్రా ఏకపక్షంగా వ్యవహరించిందని, ఈ నష్టాన్ని ఎవరూ భరించాలని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు.

గురువారం ఎర్రకుంటలో అపార్ట్‌మెంట్‌ను కూల్చివేసిన దృశ్యం

రంగనాథ్‌కు మరింత ప్రోత్సాహం ఇవ్వండి

రాష్ట్రం మొత్తానికి హైడ్రాను విస్తరించండి

ఎక్స్ వేదికగా సీఎం రేవంత్‌రెడ్డికి ఆకునూరి మురళి వినతి

ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణలో తనదైన శైలిలో పనితీరును ప్రదర్శిస్తున్న హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్‌ను మరింత ప్రోత్సహించాల్సిన అవసరమున్నదని రిటైర్డ్ ఐఏఎస్ ఆకునూరి మురళి గురువారం ఎక్స్ వేదికగా అభిప్రాయం వ్యక్తం చేశారు. హైడ్రాను రాష్ట్రం మొత్తానికి విస్తరించాలని సీఎం రేవంత్‌రెడ్డిని కోరారు. ప్రజాప్రతినిధులు అడ్డగోలుగా చెరువు శిఖం భూములను ఆక్రమిస్తున్నారని పేర్కొంటూ.. భవిష్యత్‌తరాలకు మంచి పర్యావరణాన్ని అందించాల్సిన అవసరమున్నదని, రంగనాథ్ మంచి చేస్తున్నారని ఆకునూరి మురళి ప్రశంసించారు.

గురువారం రాత్రి సచివాలయం ఎదుట భారీగా నిలిచిన ట్రాఫిక్‌తో వాహనదారులు తీవ్రంగా ఇబ్బందులుపడ్డారు.

సైబర్ కాప్స్ స్పీడ్ తగ్గింది

1930పైనే ఆధారపడుతున్న పోలీసులు

ఏడాది కిందట ప్రశంసలు.. నేడు విమర్శలు

వనరులు ఉన్నా.. పట్టించుకోని వైనం

కేసు నమోదుతోనే సరిపుచ్చుకుంటున్న తీరు

రూ. కోట్లు పోతున్నాయి.. వేలల్లో రికవరీతో సర్దుబాటు

సిటీబ్యూరో, ఆగస్టు 15 (నమస్తే తెలంగాణ): సైబర్‌నేరాల్లో పోతుంది కొండంత అయితే.. రికవరీ మాత్రం గోరంతగా ఉంటున్నది. జీరో అవర్‌లో కాల్ చేయలేదంటే.. మేం ఏం చేయలేమన్నట్లు సైబర్‌క్రైమ్ పోలీసులు వ్యవహరిస్తున్నారు. బీఆర్ఎస్ హయాంలో దేశవ్యాప్తంగా తెలంగాణ సైబర్‌క్రైమ్ పోలీసులు హడల్ ఎత్తించేవారు. వేగంగా కేసుల నమోదుతో పాటు నేరగాళ్లు ఎక్కడున్నా వాళ్ల ఆటకట్టించేవారు. నేడు ఆ పరిస్థితి లేదు. సైబర్‌నేరగాళ్లు రోజుకో కొత్త పంథాల్లో దోచుకుంటున్నా.. కేసుల నమోదుతోనే పోలీసులు సరిపుచ్చుతున్నారు. దర్యాప్తులోనూ వేగం తగ్గింది. బాధితుల డబ్బులు రికవరీ విషయంలో 1930పైనే ఎక్కువగా ఆధారపడుతున్నారు. రూ. కోట్లు పోతున్నా..రికవరీలు మాత్రం వేలల్లోనే ఉంటున్నాయి.

ఏడు నెలల్లో సుమారు 5వేల కేసులు..

హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ పోలీస్ కమిషనరేట్లలోని సైబర్‌క్రైమ్ పోలీస్‌స్టేషన్లలో ఈ ఏడాది మొదటి ఏడు నెలల్లో సుమారు 5 వేల వరకు కేసులు నమోదయ్యాయి. వీటికి ఆయా శాంతి భద్రతల పోలీస్‌స్టేషన్లలో నమోదయ్యే కేసులు అదనం. ఇందులో 2 వేల వరకు సోషల్‌మీడియా, ఇతరాత్ర ఉన్నా.. 3 వేల వరకు మాత్రం ఆర్థికంగా నష్టం జరిగిన కేసులు నమోదయ్యాయి. ట్రై కమిషనరేట్ల పరిధిలో ప్రతి నెల రూ. 20 కోట్ల నుంచి రూ. 25 కోట్లు వరకు నష్టం జరుగుతున్నది. ఇందులో ఇన్వెస్ట్‌మెంట్ ఫ్రాడ్, ఫెడెక్స్, ట్రేడింగ్ మోసాల్లో ఎక్కువగా నష్టం వాటిల్లుతున్నది.

1930పైనే ఆధారం..

సైబర్‌నేరాలు జరిగిన వెంటనే జీరో అవర్‌లో 1930కి, నేషనల్ సైబర్‌క్రైమ్ పోర్టల్‌లో ఫిర్యాదు చేస్తే.. పోయిన సొత్తు వెనక్కి వచ్చేందుకు అవకాశాలుంటాయి. బాధితులు పోర్టల్‌లో ఫిర్యాదు చేస్తే.. సైబర్ నేరగాళ్లకు సంబంధించిన బ్యాంకు ఖాతాలు ఫ్రీజ్ అయితే అదృష్టం. ఒకవేళ నిందితుల ఖాతాల్లో డబ్బు ఆగలేదంటే.. బాధితులకు నగదు రావడం గగనమే అవుతుంది. అయితే సైబర్ క్రైమ్ పోలీసులు కూడా పూర్తిగా 1930పైనే ఆధారపడుతున్నారు.

పక్క రాష్ట్రాల మాదిరిగానే..

సైబర్‌నేరం జరగగానే బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేయడం కేసు నమోదు చేసి పక్కన పడేయడం చేస్తుంటారు. ఇది పొరుగున ఉండే చాలా రాష్ట్రాల్లో గతంలో జరిగేది. కేసుల నమోదుతో పాటు రికవరీలో కూడా తెలంగాణ పోలీసులు గతంలో భేషుగ్గా పనిచేశారు. నేడు సమర్థులైన అధికారులున్నా.. తమ కెందుకులే అన్న చందంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలున్నాయి. కొన్ని కేంద్రాల్లోని అధికారులకు సైబర్‌నేరాలపై అవగాహన లేకున్నా.. పోస్టింగ్‌లు ఇచ్చి కూర్చోబెడుతున్నారనే విమర్శలు సైతం వినిపిస్తున్నాయి. సైబర్‌నేరాల్లో దొంగలు దొరికేది ఉందా? ఎవరో ఖాతాదారుడు మాత్రమే దొరుకుతాడు. ఇక మనం ఢిల్లీ, రాజస్థాన్‌కు వెళ్లి చేసేదేముందని కొందరు పోలీసులు వాదన వినిపిస్తున్నారు.

గ్రేటర్‌లో భారీ వర్షం

సికింద్రాబాద్‌లో అత్యధికంగా 7.48 సెం.మీలు

సిటీబ్యూరో, ఆగస్టు 15 (నమస్తే తెలంగాణ): బంగాళాఖాతంలో ఏర్పడిన ఆవర్తనం ప్రభావంతో గ్రేటర్‌లోని పలు చోట్ల గురువారం భారీ వర్షం కురిసింది. మూడు నాలుగు రోజులుగా ఉక్కపోతతో ఉక్కిరి బిక్కిరవుతున్న నగరవాసులు ఈ వర్షంతో కొంత ఉపశమనం పొందారు. ఒక్కసారిగా కురిసిన వానతో నగరంలో పలు చోట్ల రోడ్లపై వరద నీరు నిలిచి, ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. మరికొన్ని లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. రాత్రి 9గంటల వరకు సికింద్రాబాద్‌లోని పాటిగడ్డలో అత్యధికంగా 7.48, బన్సీలాల్‌పేట్‌లో 7.30 వర్షపాతం నమోదైనట్లు టీజీడీపీఎస్ అధికారులు వెల్లడించారు. కాగా ఆవర్తనం కొనసాగుతుండటం వల్ల రాగల మరో రెండు రోజులు గ్రేటర్‌లోని పలు చోట్ల తేలికపాటి నుంచి మోస్తరు, మరికొన్ని చోట్ల ఉరుములు, మెరుపులతో కూడిన మోస్తరు నుంచి భారీవర్షాలు కురిసే అవకాశాలున్నట్లు హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది.

మేయర్ అనుచరులు కొట్టారంటూ.. మహిళ ఆత్మహత్యాయత్నం!

సమస్యలపై ప్రశ్నిస్తే దాడులు, బెదిరింపులు

గద్వాల్ విజయలక్ష్మి సాక్షిగా వివాదం

బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్‌కు పంచాయితీ

సిటీబ్యూరో: నగరాభివృద్ధిలో ముఖ్య భూమిక పోషించడం, మౌలిక వసతుల కల్పన, ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ వారి కష్టాల్లో మేయర్ అండగా నిలబడాలి.. కానీ ఆమె ప్రాతినిధ్యం వహిస్తున్న డివిజన్‌లోనే ప్రజా సమస్యలపై ప్రశ్నిస్తే అంతుచూస్తామనే రీతిలో బెదిరింపులు దిగుతుండటం చర్చనీయాంశంగా మారింది. సమస్యల పరిష్కారం కోసం అందరూ కలిసి ఏర్పాటు చేసుకున్న గ్రూప్‌లో మేయర్, ఆమె మనుషులు ప్రశ్నించే గొంతుకలను భయభ్రాంతులకు గురి చేస్తున్నారు. హౌస్ ఓనర్స్‌గా ఏర్పడిన గ్రూప్ రాజకీయ పార్టీల మధ్య విభేదాలుగా మారి..చివరకు మేయర్ మనుషులు జరిపిన దాడితో అవమానభారంతో బీజేపీకి చెందిన మహిళా కార్యకర్త పావని ఆత్మహత్యకు యత్నించారు. మేయర్ మనుషులు పావనిని కొట్టి రోడ్డు మీదకు తీసుకువచ్చి దుర్భాషలాడారని, దీంతో మనస్థాపానికి గురైన పావని.. నిద్రమాత్రలు మింగి ఆత్మహత్యకు యత్నించినట్లు పావని బంధువులు తెలిపారు. పావని మనుషులతో పాటు బీఆర్ఎస్ కార్యకర్త రాజు ముదిరాజ్ సైతం మేయర్ మనుషులతో ప్రాణహాని ఉన్నదని పోలీస్‌స్టేషన్ మెట్లు ఎక్కారు.

బీఆర్ఎస్ నేత రాజు

అసలేం జరిగిందంటే.. బంజారాహిల్స్ రోడ్ నంబర్ 12లో ఎన్‌బీటీనగర్ బస్తీలో మేయర్ గద్వాల్ విజయలక్ష్మి నివాసం ఉంటుంది. ఈ బస్తీకి సంబంధించి 850 మంది ఇంటి యజమానులు, అధికారులు కలిసి ఓ వాట్సాప్ (ఎన్‌బీటీ నగర్ హౌస్ ఓనర్స్) గ్రూప్ ఏర్పాటు చేశారు. ఇందులో పలు సమస్యలపై బస్తీ వాసులు గ్రూప్‌లో పోస్టు చేయడం, అధికారులు సమాధానం చెప్పడం వంటివి కొంతకాలంగా జరుగుతూ వచ్చింది. ఈ గ్రూప్‌లో మేయర్ కూడా ఒక సభ్యురాలుగా ఉన్నారు. నాలుగు రోజుల కిందట బీజేపీ నాయకురాలు పావని సమస్యలను ఎవరూ పట్టించుకోవడం లేదంటూ విమర్శలు చేశారు. గ్రూపులో విమర్శలు వద్దని మెజార్టీ సభ్యులు రిప్లై ఇవ్వడంతో పావని పోస్టు తప్పుగా చేశానని.. బదులు ఇవ్వడంలో ఇక్కడ చర్చకు ఫుల్‌స్టాప్ పడింది. గురువారం పావని ఇంట్లో ఉండగా, మేయర్‌కు చెందిన మనుషులు ఆమెను కొట్టి రోడ్డు మీదకు తీసుకువచ్చి దుర్భాషలాడారు. మనస్థాపానికి గురైన పావని.. నిద్రమాత్రలు మింగి ఆత్మహత్యకు యత్నించారు. ఆమె తరపున కొందరు మేయర్ మనుషులపై బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

జెండా పండగ రోజే..

బస్తీలో ప్రభుత్వ పాఠశాల వద్ద ఉన్న ఖాళీ మైదానంలో కొంతమంది అక్రమంగా పార్కింగ్ చేసుకొని గంజాయి వంటి మత్తు పదార్థాలు వినియోగిస్తుండడంతో బస్తీ వాసులంతా కలిసి నో పార్కింగ్ బోర్డు ఏర్పాటు చేశామని ఫిర్యాదులో పేర్కొన్నారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా జెండా ఎగురవేసేందుకు మేయర్ రాగా...ఆమె అనుచరులు నో పార్కింగ్ బోర్డును కాలితో తన్నడంతో పాటు బెదిరింపు ధోరణితో మాట్లాడారని బాధితులు చెబుతున్నారు. మేయర్ మనుషులు తన ఇంటిని పడగొట్టిస్తామంటూ బెదిరించారని బీఆర్ఎస్ నేత రాజు ముదిరాజ్ ఆరోపించారు. వంద మంది గుండాలు వచ్చి బెదిరిస్తున్నారని, తనను చంపేస్తామంటూ భయభ్రాంతులకు గురి చేస్తున్నారని రాజు ఆరోపించారు.